
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

# మీటర్లు పెట్టే కాంగ్రెస్ మాకెందుకు?

## ఒకలు మీటర్లు పెట్టుమంటరు

- వాళ్ల రాష్ట్రాల్లో ఒప్పందం చేసుకుంటరు
- ఇక్కడేమో పూటకో మాటతో పరేషాన్ చేస్తున్రు
- ఇన్ని రోజులు కేసీఆర్ చెప్తే ఏమో అనుకున్నం
- ఇప్పుడే మాకు అర్థమైతంది
- కాంగ్రెస్, బీజేపీని ఇంకా నమ్మి మోసపోం
- కరెంటిచ్చిన కేసీఆర్‌కే ఓటేస్తం
- స్పష్టం చేసిన జిల్లా రైతులు



కరీంనగర్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'కాంగ్రెస్‌కు ఓటేస్తే బాయిలకాడ మీటర్ల పెడుతరని మాకిప్పుడు అర్థమైంది. నిన్ననే బీజేపీ కేంద్ర మంత్రి నిర్మలమ్మ కుండబద్దలు కొట్టినట్టు చెప్పడం టీవీల్లో జూసినం. కాంగ్రెస్ అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాల్లో బాయిల కాడ మీట ర్లు పెట్టడానికి అక్కడి ప్రభుత్వాలు ఒప్పుకున్నట్లు వార్తలు జూసినం. ఒక్క కేసీఆరే దీన్ని వ్యతిరేకించినట్టు కేంద్ర మంత్రే చెప్పింది. పాపం కేసీఆర్ ఇన్నాళ్లూ మీటర్ల మాట చెప్తే ఏమో అనుకున్నం. కాంగ్రెస్, బీజేపీ చెప్పే మాటలు నిజం కావొచ్చనుకున్నం. కానీ, ఇప్పుడు అసలు రంగు బయటపడ్డది. ఇంకా నయం. ఎలక్షన్ల తర్వాత అయితే మో సం జరిగేది' అని జిల్లా రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏదేమైనా తమ మంచికే జరిగిందని, ఇప్పుడు తమకు పూర్తిగా అర్థమైందని చెబుతున్నా రు. రైతుల మీద కేసీఆర్‌కు ఎంతో ప్రేమ ఉన్నదని, తమ బతుకు దెరువు కోసం కేంద్రంతోనే కొట్లాడిన కేసీఆర్‌కు కాకుండా ఇంకెవరికి ఓటేస్తామని, బరాబర్ కారు గుర్తుకే ఓటేస్తామని స్పష్టం చేస్తున్నారు. 'అవ్వా ఇన్ని అబద్ధాలా..? మేం మీటర్లు పెడుతం అనలేదని బీజేపోళ్లు, మేం ఏ రాష్ట్రంలో మీటర్లు పెట్టడానికి ఒప్పుకోలేదని కాంగ్రెసోళ్లు ఇప్పటి వరకు చెప్పిన్రు. మమ్మల్ని నమ్మించే ప్రయత్నం చేసిన్రు. మాయ మాటలతో మమ్మల్ని మోసం చేసేతందుకు చూసిన్రు. మరి ఇప్పుడు అసలు గుట్టు బయట పడ్డది' అని మండిపడుతున్నారు. ఇవన్నీ చూస్తే ఎవరేం చెప్పినా వినిపించుకునేది లేదని, తమకు 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతు బీమా ఇస్తూ ఆసరా అవుతున్న కేసీఆర్‌కే అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కరెంటుతోపాటు బావుల కాడ మోటర్ల బిగింపు విషయంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన మాటలు బీజేపీ కాంగ్రెస్ వ్యవహార శైలిని బట్టబయలు చేసిన నేపథ్యంలో రైతులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.



### నమ్ముడద్దు.. మోసపోవద్దు..

కాంగ్రెస్ నాయకులు అన్నట్లు 3 గంటల కరెంటు ఇస్తే రైతులు వ్యవసాయం చేయరు. తెలంగాణ ప్రభుత్వం 24 గంటలపాటు నాణ్యమైన కరెంటు ఇస్తున్నది. మేం 5హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని మంచిగా పంటలు పండించుకుంటున్నం. లోవోల్టేజీ సమస్య లేదు. రేవంత్ రెడ్డి అన్నట్లు 10 హెచ్‌పీ మోటర్లు పెడితే.. ఎకరం పారే లోపే నీళ్లయిపోతయ్. మళ్ల ఊరి పారిస్తే మళ్ల అదే ఎకురం తడుస్తది. కిందికి పోయేలోపే అయిపోతయ్. ఇంకా రైతులందరు పెద్ద మోటర్లు వాడితే ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడుతుంది. స్టార్టర్, మోటర్ కాలిపోయే ప్రమాదం ఉంటుంది. ఇది రైతులకు ఆర్థికంగా నష్టం చేస్తుందే తప్ప మేలుచేయదు. అట్లాంటి కాంగ్రెస్ మాకు అవసరం లేదు. వాళ్లను నమ్ముడద్దు.. మోసపోవద్దు. రైతులకు మంచి చేస్తున్న బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుంటం.

**-దాసరి గంగారాజం, రైతు(రుద్రంగి)**



### మూడు గంటలు సరిపోతదా..?

తొమ్మిదేండ్ల కింద గింత మంచిగా కరెంటాడిది. నీళ్లెక్కడియి. గీయింత సెరువు మంచిగజెయ్యవటికె సెరువు నిండ నీల్లచ్చినయ్. కరువుల గూడ ఎండిపోకుండ ఉన్నది. అందుకే బోర్లల్ల నీల్లున్నయ్. కడుపు నిండ కరెంటు గూడ ఇయ్యవట్టికె ఏడెకరాల్ల వరి, పత్తి పంట పెడుతున్న. ఇంతకు ముందు కరెంటు సక్కగ లేక.. నీళ్లు లేక రెండెకరాలు వరి పెట్టి సాలిచ్చుకున్నం. ఇగ కాంగ్రెసోల్లు ఇచ్చే మూడుగంటల కరెంటు ఏడ సరిపోతదు. కరెంటు 24 గం టలుంటే తీరికున్నప్పుడు కరెంటు పెట్టుకుంటున్నం. ఇప్పుడే కరెంటు మంచిగిస్తున్నరు.

**- మద్దుల లింగారెడ్డి, రైతు (ఎల్లారెడ్డిపేట)**



### అప్పట్లో అరిగోస పడ్డం

నాకు నారాయణపూరంల 8 ఎకరాలు, రాగట్ల రెండెకరాల భూమి ఉంది. అప్పుడు నీళ్లు, కరెంటు లేక అరిగోస పడ్డం. నీల్లు లేక కాలమైనప్పుడు పత్తి పంట పెట్టి ఎకరం, రెండెకరాలు వరి పండిచ్చేది. ఇప్పుడు సెరువుల నీల్లున్నయ్, బోర్లాల్ల ఉన్నయ్. అట్లున్నందుకు కరెంటు గూడ ఎప్పుడు పోకుంట ఉన్నది. ఇప్పుడు వరి పంటనే ఎక్కువ పండిస్తున్నం. మూడు గంటల కరెంటు ఏ మూలకు మొదలుగాదు. అది రైతులను మోసం చేసేందుకే వ్యవసాయం గురించి తెల్వనోల్లు అసొంటి మాటలు మాట్లాడతరు.

**- సాదు మల్లారెడ్డి, రైతు, నారాయణపురం (ఎల్లారెడ్డిపేట)**

### వాళ్లు మళ్లచ్చుడు ఎందుకు? మేం ఆగమవుడెందుకు?

కాంగ్రెస్ పాలనలో కరెంటు లేక అరిగోస పడ్డం. కరెంటు ఎప్పుడు పోయేదో.. ఎప్పుడు వచ్చేదో తెలియదు. నాకు ఆరు ఎకరాల్ల ఒక్క మడి పారకపోయేది. పోయి వచ్చిన కరెంటుతో మళ్ల అదే మడి తడవాలి. గతాన్ని యాది చేస్కుంటే రాత్రి పూట టార్చిలైట్లే గుర్తొస్తున్నయి. 2005ల నేను ఆరు బోర్లు వేసినా చుక్క నీరు రాలే. రూ.ఐదు లక్షల అప్పు అయింది. 2006లో దుబాయ్‌కి పోయిన. తిరిగి ఐదేళ్ల తర్వాత వచ్చిన. కేసీఆర్ ప్రభుత్వం వచ్చినాక ఎవుసం మంచిగైంది. 24 గంటల కరెంటు అత్తంది. పుష్కలంగా నీళ్లచ్చినయ్. నాకున్న మొత్తం భూమిలో వరి సాగు చేస్తున్న. రెండు పంటలు తీస్తున్న. నా పెద్ద బిడ్డకు పెండ్లి చేసిన. కొడుకు సాఫ్ట్‌వేర్, చిన్న బిడ్డ మార్కెటింగ్‌లో జాబ్ చేస్తున్నరు. ఇప్పుడు మంచిగనే ఉన్నం. ఈ టైంల కాంగ్రెస్ మళ్ల పరేషాన్ చేస్తంది. రేవంత్ రెడ్డి 3గంటల కరెంట్ అంటండు. పెద్ద మోటర్లు పెట్టుకోవలంటండు. లక్ష రూపాయలు వెట్టి రైతులు కొంటరా..? కొన్నా వాటితో ఏం ఫాయిదా ఉంటది? మా మీది భారం తప్పితే. వాళ్లు మళ్లచ్చుడు ఎందుకు? మేం ఆగమవుడెందుకు? ఇంకేం నమ్ముతం. ఇప్పుడే ఇట్ల మాట్లాడుతున్రు. ఇంకా వాళ్లొస్తే ఏమైనా ఉంటదా..? అందుకే మేమంతా కేసీఆర్‌కే మద్దతిస్తం.

**- బద్దం బాపురెడ్డి, మూడపెల్లి (చందుర్తి మండలం)**





### ఆ పార్టీని నమ్మితే ఆగమైతం

మాకు రెండెకరాల పొలం ఉంది. కరంటుకు ఏ గోసా లేదు. పొలం మంచిగా పారుతున్నది. మునుపు గిట్ల కరెంట్ లేదు. నీళ్లు లేవు. కరంట్ కోసం మస్తు గోస పడ్డం. సగం పొలం పడావుంచేటోళ్లం. అప్పుడు గోస పెట్టిన కాంగ్రెస్, ఇప్పుడు కూడా మాయమాటలు చెబుతున్నది. మూడు గంటల కరంటు ఎట్ల సాల్తది? 10 హెచ్‌పీ మోటర్లు యాడ్నుంచి తేవాలి. లక్ష రూపాయలు కావాలట. వాళ్లమేన్న ఇత్తరా..? వాళ్లకు వ్యవసాయం గురించి ఏం తెల్వదు. అందుకే అట్ల మాట్లాడుతున్రు. ఆళ్లను నమ్మితే మోసపోతం. ఇప్పుడు కేసీఆర్ సారు కరెంటు బాగా ఇస్తుండు. నీళ్లకు, కరంటుకు ఎసొంటి తకిలిబు లేదు. మళ్ల కేసీఆర్ సారు రావాలే. లేకపోతే ఆగమైతం.

**- చుంచు బాబాయి. మహిళా రైతు(ముస్తాబాద్)**



### మోటర్లకు మీటర్లు పెడుతరు.. ఉచిత కరెంట్ లేకుండా చేస్తరు

కాంగ్రెస్ కాలంలో ఎవుసం అంటే ఏడుపొచ్చేది. నాకు రెండెకెరాలే ఉండె. కానీ, అరిగోస పడ్డ. అప్పుడు నీళ్లు లేకుండె. కరంటు లేకుండె. మస్తు తిప్పలు పడ్డం. పంటలు ఎండిపోతంటే కండ్ల నీళ్లు పెట్టుకున్నం. ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వక రాత్రుల్లు బాయిల కాడనే జాగారం చేసినం. ఎర్రబుగ్గ ఎప్పుడెలుగుతదా..? అని సూసెటోల్లం. అప్పుడంత గోస వెట్టి, ఇపుడు ఏదో చేస్తమని కాంగ్రెసోళ్లు వస్తున్నరు. వాళ్లు అచ్చేది లేదు.. సచ్చేది లేదు. వచ్చినా చేసేదేమీ కూడా లేదు. అప్పుడు ఏం చేసిండ్లో మాకు తెల్వదా..? ఇప్పుడేం చేత్తరో మాకు తెల్వదా..? అట్టిగ ఆగం పట్టించుడు తప్పితే. మోటర్లకు మీటర్లు పెట్టే కుట్ర చేస్తున్నరని ఇయ్యాలే తెలిసింది. బీజేపీ, కాంగ్రెస్ రైతులపై కుట్రలు చేస్తున్నయని ముందు నుంచి సీఎం కేసీఆర్ చెబుతనే ఉన్నడు. మాకిప్పుడే అర్థమైంది. కాంగ్రెస్, బీజేపీని ఇంక నమ్ముతమా..? తప్పిదారి ఓటేత్తే కచ్చితంగా మోటర్లకు మీటర్లు పెట్టి ఉచిత కరెంట్ లేకుండా చేస్తరు. అట్లయితే ఇక ఎవుసం పోయినట్టే. రైతుల కథ మళ్లీ మొదటికి అచ్చినట్టే. అందుకే రైతులందరూ అప్రమత్తంగా ఉండాలె. సాగును బంగారం చేసిన కేసీఆర్‌కు అండగా ఉండాలె. మూడోసారి సీఎంను చేసుకోవాలె. అనవసరంగా ఆగం కావద్దు.

**- చిర్రం మల్లేశం, రైతు, తెర్లుమద్ది (ముస్తాబాద్)**



### ఇప్పడే ఇన్ని ఏశాలేత్తున్నరు.. మున్మందు ఇంకెన్ని జేత్తరో..

పదేండ్ల కింద కరెంటు తిప్పలు ఎట్లుండె ఎవరిని అడిగినా చెపుతరు. నాకున్న మూడెకరాలకు నీళ్లు పెట్టనికి ముప్పు తిప్పలు పడ్డ. రాత్రి లేదు, పగలు లేదు. కరెంటు ఎప్పుడత్తదో తెలియదాయే. వచ్చే కరెంటు ఎంత సేపుంటదో ఇచ్చేటోనికే తెలియక పాయే. బుజాన గొంగడేసుకుని బీడీ తాగుకుంటూ అర్ధరాత్రి గట్లమీద నడుచుకుంటూ పోతే ఏ పురుగు, పూసే కుట్టి ఏమైతమోనని భయంతో బతికినం. నాడే సక్కగ గియ్యనోడు మూడు గంటలు సాలంటే.. మూడు దొయ్యాలన్న పారుతదా? అన్నోడు తెలివుండి చెపుతుండ. పది హెచ్‌పీల మోటరు పెట్టుకుంటే దానికెంత గావాలే. ఖర్చులు ఎవరు పెడతరు? ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు, సచ్చేది లేదు గానీ అప్పుడే గిన్ని యేశాలేత్తన్నరు. వచ్చినంక ఇంకెన్నీ జేతరు. వీళ్లను నమ్ముకుంటే నట్టేట ముంచుతరు. గీ పదేళ్ల సంది కరెంటు మంచిగుంటున్నది. ఒక్క మోటరు కాలిపోలేదు. ట్రాన్స్‌పార్మర్లు మంచిగ పని జేతున్నయ్. లోవోల్టేజీ అనేది లేదు.

**- పాతూరి లచ్చిరెడ్డి, రైతు, మండెపల్లి (రాజన్న సిరిసిల్ల)**



### కాంగ్రెసోళ్లకు తలెర్కనా.. తోకెర్కనా..?

మునుపు ఎట్లుండె. తల్సుకుంటనే భయమైతది. రాత్రి పొలాలకు, చేలకు నీరు పెట్టడానికి పోయి అక్కడే పడుకునేటోళ్లం. ఉన్న కొద్దీసేపు కరెంట్‌తో ఒకటి, రెండు మడులు తడిసేవి. మిగిలిన పంటకు నీళ్లు లేకపోయేది. పంట చేతికొచ్చే సమయంల ఎండిపోయేది. పెట్టుబడి ఎల్లక ఎంతో మంది ఆత్మహత్య చేసుకున్నరు. అయినా అప్పుడు ఎవరూ పట్టించుకోలె. కానీ, మాకు కేసీఆర్ ఉన్నడు. మాకోసం ఎంతో చేసిండు. 24గంటల కరెంటిత్తండు. నీళ్లు పుష్కలంగా ఉన్నయ్. నాకు మూడెకరాల పొలం ఉన్నది. 5హెచ్‌పీ మోటర్ వాడుతున్నం. కాంగ్రెసోళ్లు మూడు గంటలు కరెంట్ ఇచ్చి 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవలంటున్నరు. వాళ్లకు ఎవుసం గురించి ఏం తెలుసు? తలెర్కనా..? తోకెర్కనా..? రేవంత్ రెడ్డి చెప్పినట్టు పెద్ద మోటర్లు వాడితే ఏం ప్రయోజనం? అందరూ ఒకేసారి వాడితే ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటయా..? పేలిపోవు. ఆనాడు కాంగ్రెస్ రైతులను గిట్లనే అరిగోస పెట్టింది. ఇప్పుడు కూడా ఇట్లనే చేయాలని చూస్తున్నది. కానీ, మేం ఊరుకోం. ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తం. మా కష్టాలు తీర్చిన కేసీఆర్‌ను మళ్లోపారి గెలిపించుకుంటం.

**- కమటం స్వామి, శాంతినగర్ (వీర్నపల్లి)**



### ఆ పార్టీ వచ్చేది లేదు.. సచ్చేది లేదు

కాంగ్రెసప్పుడు వచ్చిపోయే కరెంటుతో ట్రాన్స్‌పార్మర్లు, మోటర్లు కాలిపోయేవి. ఖర్చు పెట్టుకొని మోటరు మంచిగా చేయించినా.. ఆలోపే చేను ఎండిపోయేది. అప్పట్ల ఇట్ల ఎంతో అరిగోస పడ్డం. వచ్చి పోయే కరెంట్ కోసం రోజంతా బాయికాన్నే ఉండేది. ఏదైనా పనిచేస్కుందామంటే టైం ఉండకపోయేది. తెలంగాణ అచ్చిన తర్వాత ఆ బాధలు పోయినయ్. కేసీఆర్ సారు 24గంటల కరెంట్ ఇచ్చి మా కష్టాలు తీర్చిండు. ఇంత మంచిగుండంగ మూడు గంటల కరెంట్ ఎవరికీ అవసరం? ఆ 10 హెచ్‌పీ మోటర్లతో ఎవరికి ఉపయోగం? ఆ పార్టీ వచ్చేది లేదు, సచ్చేది లేదు గానీ ఇప్పుడే ఏదేదో మాట్లడుతున్నరు. ఎవుసం గురించి తెల్వకుండా ఝూటా మాటలు మాట్లాడి ఆగం చేస్తున్రు. ఆళ్ల మాటలు ఎవరు నమ్ముతరు? ఎవరు ఓటేస్తరు? మాకు కేసీఆర్‌పై సంపూర్ణ విశ్వాసం ఉన్నది. కరెంటు 24గంటలు ఉంటున్నది. ఎప్పుడు స్టాటర్ ఒత్తితే అప్పుడు మోటరు నీళ్లు పోత్తున్నది. అవసరం ఉన్నపుడే నీళ్లు పెట్టుకొని వస్తున్నం. ఇంతగా మంచి చేసిన కేసీఆర్‌కు రైతులందరం అండగా ఉంటం. ఈనెల 30న కారు గుర్తుకు ఓటేసి గెలిపించుకుంటం.

**-వేములవాడ పూర్ణచందర్, యువరైతు, హరిదాస్‌నగర్ (ఎల్లారెడ్డిపేట)**



# ధరణి పోతే ఎన్కటి గోసే

- దళారీ దందా వస్తది.. భూములకు రక్షణ ఉండది
- రికార్డులు తారుమారైతయ్.. తగాదాలు మొదలైతయ్
- పైసా లేకుంటే పనికాదు.. నెలలు తిరిగినా కథ ఒడవదు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కర్షకలోకం
- కాంగ్రెస్‌ను నమ్మి పాత రోజులు తెచ్చుకోవద్దని సూచన

కరీంనగర్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'మునుపు భూమికి సంబంధించిన ఏదైనా దస్త్రం కావాలంటే మా దగ్గర లేదంటూ రెవెన్యూ వాళ్లు ముప్పు తిప్పలు పెటిన్రు. ఎవరికి చెప్పుకుంటవో చెప్పుకపో అన్నరు. ఏ అధికారి వద్దకు వెళ్లినా పని గాలే. ఏమన్నంటే ఆ దస్త్రాలు చినిగిపోయినవి అనేటోళ్లు. నిజాం కాలం నాటి రికార్డులు మా దగ్గర ఉంటయా..? అని బెదిరించేటోళ్లు' అని జిల్లా రైతులు నాటి పాలనలో పడ్డ గోసను గుర్తు చేసుకున్నారు. ధరణి వచ్చిన తర్వాత ఎవరి దగ్గరకు పోవాల్సిన అవసరం లేకుండా పోయిందని, రిజిస్ట్రేషన్ అయిన వెంటనే కాగితాలు వస్తున్నాయని, తమ పాస్‌బుక్కులు పట్టుకొని పోతే చాలు ధరణిలో చూసి లోన్లు ఇస్తున్నారని సంతోష పడుతున్నారు. స్వరాష్ట్రంలోనే తమ భూములకు భద్రత ఏర్పడిందని, గ్రామాల్లో జాగల కిరికిరి పోయిందని, ఉన్నదాంట్లో కొంత అమ్ముకుంటే.. వెంటనే మా పాస్‌బుక్కులో తగ్గి.. కొన్నోళ్ల పేరిట ఎక్కుతున్నదని, వాళ్లకు మ్యుటేషన్ అయితున్నదని చెబుతున్నారు. గతంలో అమ్మినోళ్ల భూమి నుంచి కట్ అయ్యేది కాదని, కొన్నోళ్లకు ఎక్కాలంటే నెలలు తిరగాల్సి వచ్చేదని, లంచాలు ఇవ్వనిదే పని అయ్యేది కాదని, ఇటు ఏ గ్రామంలో చూసినా భూతగాదాలే కనిపించేవని, అవి హత్యలకు కూడా దారితీసేవని అప్పటి రోజుల గురించి చెప్పారు. ఇప్పుడు అంతా మంచిగున్న సమయంలో కాంగ్రెసోళ్లు ధరణి ఎత్తేస్తామంటున్నారని మండిపడుతున్నారు. ధరణి ఎత్తేస్తే ఎన్కటి లెక్క దళారులే వస్తారని, మళ్లీ గొడవలు జరుగుతాయని, అరిగోస పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ గురించి ఆలోచించి ధరణిని తెచ్చి భూములకు రక్షణ కల్పించి, గొడవలు లేకుండా చేసిన కేసీఆర్‌కు కర్షకలోకం అండగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.



### నాటి గోసలు మళ్లీ మొదలైతయ్

కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తామంటున్నరు. ధరణి వచ్చిన తర్వాత ఒకే దగ్గర మ్యూటేషన్, రిజిస్ట్రేషన్లు అయిపోతున్నయ్. రైతులకు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చూట్టూ తిరిగే బాధలు తప్పినయి. ధరణి రద్దు చేస్తే రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాలి. వీఆర్వోలు, పట్వారీల వెంట తిరిగినా పని కాదు. లంచాల రాజ్యం మళ్లీ వస్తుంది. అలాంటి కాంగ్రెస్ మనకు అవసరం లేదు. రైతులకు క్షణాల్లో పని చేసిపెడుతున్న ధరణిని రద్దు చేస్తామంటున్న ఆ పార్టీకి వాళ్లకు ఓటేస్తే మళ్లీ ఎనకటి రోజులు వస్తయ్. నాడు పడ్డ గోసలు మళ్లీ మొదలైతయ్. రైతుల సంక్షేమ కోసం పాటుపడే కేసీఆర్ ప్రభుత్వం గాక వేరే ఏది వచ్చినా రైతుల బతుకులు ఆగమైతయ్. రైతులను అన్ని విధాలా ఆదుకొనే బీఆర్‌ఎస్‌కు, కేసీఆర్ ప్రభుత్వానికే నా మద్దతు.

**- రాధారపు లచ్చయ్య, అడవిపదిర (వీర్నపల్లి)**



### మళ్లీ ఆఫీసుల చుట్టూ తిరగాలా..?

కాంగ్రెస్ నాయకులు ధరణి తీసేసి భూమాత పోర్టల్ తీసుకొస్త మంటున్రు. అది వస్తే రైతుల భూములకు రక్షణ లేకుండా పోతుంది. పాత రోజులు వస్తయ్. రికార్డుల్లో పేర్లు మారుతయ్. ఆఫీసుల చుట్టూ తిరుగుడే అయితది. పైసా లేనిదే పని కాదు. సీఎం కేసీఆర్ ధరణితో భూములకు భద్రత ఉంటుంది. ఏ రైతుకు ఎంత భూమి ఉన్నదో ఈజీగా తెలుసుకోవచ్చు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణిని ఎత్తివేస్తరు. కౌలు రైతులకు రైతుబంధు అందుతుంది. పోర్టల్‌లో కౌలుదారులు, అనుభవదారులకు స్థానం లభిస్తుంది. మళ్లీ గొడవలు మొదలైతయ్. అయినా కాంగ్రెసోళ్లు అప్పుడే కలలుకంటున్రు. వాళ్లు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు. రైతులమంతా కేసీఆర్‌కు మద్దతు తెలుపుతున్రు. ఎట్లయిన గెలిపించుకుంటం.

**- పంతగి సతీశ్, రైతు, హరిదాస్‌నగర్ (ఎల్లారెడ్డిపేట)**



### రైతులు తరిమికొడ్తరు

రాష్ట్రం రాక ముందు దళారీలు, పైరవీకారుల రాజ్యం ఉండేది. ఎంతో కొంత ముట్టజెప్పితనే పనులయ్యేది. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. తెలంగాణ ప్రభుత్వం ధరణి తేవడంతో ఆ తిప్పలు తప్పినయ్. భూమి రిజిస్ట్రేషన్ తొందరగా అయిపోతది. ఎవరికీ రుపాయి ఇవాల్సిన అవసరం లేదు. పట్టా దారు పాసుబుక్ ఇంటికే వస్తది. ధరణి తీసేస్తే మళ్లీ పాత పరిస్థితి వస్తది. రైతులకు కష్టాలు మొదలైతయ్. పైసల్లేకుండా ఏ పనీ కాదు. ఇంత మంచిగున్న ధరణిని తీసివేస్తామన్న కాంగ్రెస్‌ను ఎవరూ నమ్మరు. ఇటువంటి నాయకులను గ్రామాల నుంచి రైతులందరూ తరిమికొడ్తరు.

**-సంబ బాలయ్య, రైతు(బోయినపల్లి)**



### కాంగ్రెస్, బీజేపీకి చరమగీతం పాడుతం

ధరణిని తెచ్చినంక పైరవీకారులు, రెవెన్యూ అధికారుల అక్రమాలకు చెక్ పడింది. ధరణికి ముందు పల్లెల్లో పైరవీకారులు, వీఆర్‌వోలు, రెవెన్యూ అధికారులు ఆడిందే ఆటగా సాగింది. నాడు రైతుల పేర్లు, సర్వే నంబర్లు మార్చి అరిగోస పెట్టిన్రు. భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ నెలలపాటు తిరిగేది. ఒక్కోసారి రెవెన్యూ అధికారులను కార్యాలయంలో బంధించిన సందర్భాలు ఉండేవి. ధరణి రావడంతో రైతుల బాధలు తీరినయ్. గ్రామాల్లో భూ సమస్యలు లేకుండా పోయినయ్. కాంగ్రెస్, బీజేపీ అధికారంలోకి రాక ముందే ఆగం చేస్తున్రు. ధరణిని తీసివేస్తామని చెబుతున్రు. అట్లయితే రాబందుల రాజ్యం మళ్లీ మొదలై తది. అందుకే రైతులందరూ సమష్టిగా ఉంటం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి చరమగీతం పాడుతం. కాంగ్రెస్ నాయకులను గ్రామాలకు రానీయద్దు.

**-దుడ్డెల లచ్చయ్య, రైతు (బోయినపల్లి)**



### పట్వారీ వ్యవస్థతో పంచాయితీలే

ధరణి రాక ముందు రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండే. ఎవరికి తగ్గట్టు ఆళ్లు రాత్రికి రాత్రే రికార్డులను మార్చెటోళ్లు. సర్వే నంబర్లలో కొత్త కొత్తోళ్ల పేర్లను చేర్చి విస్తీర్ణం పెంచెటోళ్లు. పహాణీ నకళ్లలో అనుభవదారు, పట్టాదారు రెండు కాలమ్స్ ఉండేవి. రైతులు దరఖాస్తు చేస్తేనే వివరాలిచ్చేటోళ్లు. పట్వారీ వ్యవస్థతో భూ తగాదాలు ఉండేటియి. అవి పోలీస్‌స్టేషన్ దాకా పోయేటియి. కొన్నిసార్లు హత్యకు కూడా దారితీసేటివి. తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక సీఎం కేసీఆర్ ధరణిని తెచ్చి భూములకు భద్రత కల్పించిండు. అరచేతిలోనే ధరణిలో వివరాలు చూసుకునే వెసులుబాటు కల్పించిన్రు. నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్లు చేస్తున్రు. భూములకు భద్రత కల్పించిన్రు. ఇది చూసి ఇతర రాష్ట్రాలోళ్లు ఇక్కడ భూములను కొంటున్రు. పటేల్, పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు పైసా లేనిదే పనయ్యేది కాదు. ఎవరైనా ఎక్కువ పైసలిస్తే వారి పేర్లను చేర్చి గొడవలు పెట్టించెటోళ్లు. ఇలాంటివి మస్తు చూసినం. ఈ వ్యవస్థ లేకుంటే భూ గొడవలే ఉండేవి కావని కేసీఆర్ మంచి నిర్ణయం తీసుకున్నడు. పట్వారీ వ్యవస్థ రద్దు చేసిండు. ధరణిని తెచ్చి మంచి పనిచేసిండు. కాంగ్రెసోళ్లను మేం నమ్మం. అప్పట్ల ఎంత గోసపెట్టిన్రో ఇంకా మరువలె. అందుకే ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతం. భూ సమస్యలు లేకుండా చేసిన కేసీఆర్‌కే అండగా నిలుస్తం.

**- జగపల్లి లచ్చిరెడ్డి, రైతు, మర్రిగడ్డ(చందుర్తి)**



### ఆ పార్టీని బంగాళాఖాతంలో కలుపుతం

తెలంగాణ రాకముందు ఉన్న పట్వారీ వ్యవస్థతో మస్తు ఇబ్బందులు పడ్డం. పహాణీ కావాలంటే వారి చేయి తడపనిదే వివరాలు ఇచ్చే వారు కాదు. చాలా మంది రైతులు రికార్డులు కావలన్నా.. మ్యూటేషన్ కావలన్నా పనులు వదిలిపెట్టి తహసీల్ ఆఫీసు చుట్టూ తిరిగెటోళ్లు. పైరవీకారుల చేతిలో నష్టపోయేటోళ్లం. కాంగ్రెసోళ్లు ధరణి తీసేసి భూమాత తీసుకొస్తాం అంటున్రు. అట్లయితే ఎవరీ భూమి ఎక్కడ ఉంటుందో తెల్వది. రైతులను మళ్లీ బిచ్చగాళ్లను చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతున్నది. వాళ్ల పాలనలో భూమి రిజిస్ట్రేషన్‌కు పొద్దున పోతే సాయంత్రం వచ్చేటోళ్లం. ఇప్పుడు ఎమ్మార్వో ఆఫీసులోనే 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ధరణితో అక్రమాలకు అస్కారం లేకుండా అయింది. కాంగ్రెసోళ్లను నమ్మితే రైతులు ఆగమే. ధరణి పోర్టల్‌ను తీసేస్తమని అంటున్న కాంగ్రెస్‌ను రైతులంతా ఏకమై బంగాళాఖాతంతో కలుపుతం.

**-భూక్యా రాజు, భూక్యాతండా (వీర్నపల్లి)**